## కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 23, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 28, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 10–12, ముల్లంగి 4–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## 2న సరస్వతి అష్టోత్తర సహిత పుస్తక పూజ

సనత్‌నగర్: వసంత పంచమి సందర్భంగా సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న 'సరస్వతి అష్టోత్తర సహిత పుస్తక పూజ' నిర్వహించనున్నట్లు సమితి ప్రతినిధి బుచ్చిబాబు తెలిపారు. మోడల్ కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనే చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో (తెలుపు రంగు డ్రెస్) హాజరుకావాలన్నారు. మొదటి 200 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ సహకారంతో పీవీ నరసింహా రావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాలకు చెందిన డిగ్రీ, పీజీ విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ టి. గంగాధర్, వైస్ ప్రిన్సిపల్ మృదుల లక్కరాజు, ఎస్ఎస్ఎస్ ప్రోగామింగ్ ఆఫీసర్ డాక్టర్ రాజేందర్ పాల్గొన్నారు.

## 10 నుంచి కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఫిబ్రవరి 10 నుంచి మాజీ సీఎం కేటీఆర్ కప్–2025 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు డా.తుంగ బాలు తెలిపారు. బుధవారం ఓయూలో టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు విజయ్ రావు, కొంపల్లి నరేష్, నవీన్‌గౌడ్, మధు, పవన్‌కుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పీఎస్ నేతల ప్రచారం



కార్యక్రమంలో మాదిగ సంఘాల నాయకులు

లాలాపేట: ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న నిర్వహించనున్న వేల గొంతులు..లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మాదిగ సంఘాల నేతలు బస్తీల్లో ప్రచారం నిర్వహించారు. బుధవారం తార్నాక మాదిగ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లాలాపేటలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో పరమేష్, కిరణ్, నాగరాజు, రాజలింగం, గిరి, మల్లేష్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్ : మెట్రోరైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడకు చెందిన రవీందర్‌నాయక్ ఈనెల 28న మధురానగర్ మెట్రోస్టేషన్ వద్ద తన బైక్ పార్క్ చేసి చైతన్యపురి వెళ్లి తిరిగి వచ్చాడు. అనంతరం వైన్స్‌షాపు వద్దకు వెళ్లి వచ్చేసరికి అతడి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి అదృశ్యం

వెంగళరావునగర్ : ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడ ప్రాంతంలో సంతోష్ గో స్వామి, షీలా గిరి దంపతులు రోజులుగా నివాసం ఉంటున్నారు. ఈనెల 28న భర్తకు ఆరోగ్యం సరిగా లేకపోవడం వల్ల షీలా గిరి మాత్రమే కూలీ పనికి వెళ్లింది. సాయంత్రం ఆమె ఇంటికి తిరిగి వచ్చి చూడగా భర్త కనిపించలేదు. అతడి కోసం తెలిసిన వారు, మిత్రుల వద్ద గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆనందంగా.. ఆడేద్దాం..!

ఎప్పుడూ క్రికెట్టేనా... ఇతర గేమ్స్ కూడా ఆడండి..ముఖ్యంగా హ్యాండ్‌బాల్ నేర్చుకోండి అని చెబుతున్నారు కోచ్‌లు.. ఒకటి,రెండు కాదు దశాబ్దాల తరబడి హ్యాండ్‌బాల్ శిక్షణ ఇస్తూ జాతీయ, అంతర్జాతీయస్థాయికి క్రీడాకారులను తీసుకెళ్లారు హ్యాండ్‌బాల్ శిక్షకులు. సనత్‌నగర్ కార్మిక సంక్షేమ మైదానం ఎప్పుడు చూసినా హ్యాండ్‌బాల్ సందడి కనిపిస్తుంది.



- సనత్‌నగర్ గ్రౌండ్‌లో దశాబ్దాలుగా హ్యాండ్‌బాల్ శిక్షణ
- జిల్లా స్థాయి క్రీడాకారులకు ఇక్కడి నుంచే ఎంపిక..
- రాష్ట్ర, జాతీయ స్థాయికి పునాది ఇక్కడే..



సనత్‌నగర్: హ్యాండ్‌బాల్‌పై ఉన్న ఆసక్తితో నేటి తరం వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు చిన్నప్పటినుంచే బీజాలు నాటుతున్నారు. అందుకోసం స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులను ప్రోత్సహిస్తూ హ్యాండ్‌బాల్‌లో శిక్షణనిస్తున్నారు సనత్‌నగర్ కార్మిక సంక్షేమ మైదానం కేంద్రంగా దశాబ్దాలుగా హ్యాండ్‌బాల్ శిక్షణ ఇస్తున్నారు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు.

### ఎందరో ఆణిముత్యాలు...

సనత్‌నగర్‌లో పలువురు హ్యాండ్‌బాల్ ఆటలో ఆసక్తి చూపడంతో 1975లో ఎస్ఆర్‌టీ కాలనీలోని కార్మిక సంక్షేమ సంఘం భవనం ఆవరణలోని ప్రత్యేక క్రీడా శిబిరం నిర్వహించారు. అలా మొదలైన శిబిరం క్రీడాకారుల్లో మరింత ఆసక్తిని రేకెత్తించింది. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతోమంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని రగిలించారు. వారిలో సనత్‌నగర్ మాజీ కార్పొరేటర్ అయూబ్‌ఖాన్, మక్బూద్, జగన్నాథం, సుభోద్ విల్సన్, ప్రబోధ్ విల్సన్, డాక్టర్ నగేశ్, విద్య, ఏఎస్ మునవర్, పీవీ నాగార్జున, ధన్‌రాజ్ తదితరులు హ్యాండ్‌బాల్ క్రీడాకారులుగా వెలుగులోకి వచ్చినవారే. అలాగే సనత్‌నగర్‌కు చెందిన ఎంఏ అజీజ్ ఏకంగా అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న ఘనతను దక్కించుకున్నారు. మరో క్రీడాకారుడు బాసిత్ ఆసియా క్రీడల ప్రాబబుల్స్‌లో స్థానం కైవసం చేసుకున్నాడు. వీరంతా వృత్తిపరంగా వేర్వేరు రంగాల్లో ఉన్నప్పటికీ హ్యాండ్‌బాల్ క్రీడపై అభిమానాన్ని మాత్రం విడవలేదు. ఇక్కడే శిక్షణ తీసుకుని కోచ్‌లుగా ఎదిగిన వారు ఎందరో ఉన్నారు.

### నిరంతర శిక్షణ

జాతీయ స్థాయిలో రాణించిన ఆనాటి మేటి క్రీడాకారులంతా సంఘటితమై 1980లో అప్పటి రంగారెడ్డి జిల్లా (ప్రస్తుత మేడ్చెల్ జిల్లా)హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కొన్ని వేల మంది హ్యాండ్‌బాల్ క్రీడాకారులను తీర్చిదిద్దారు. ఎక్కడ ఏ పోటీ జరిగినా జిల్లా నుంచి పాల్గొనే టీమ్‌ను సన్నద్ధం చేసేది ఈ అసోసియేషనే సభ్యులే. ఇక్కడ శిక్షణ పొందేవారు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక అవుతున్నారు. అండర్–12, అండర్–16, అండర్–19, సీనియర్స్ విభాగాల్లో ఇక్కడ శిక్షణ అందిస్తున్నారు.

### స్పోర్ట్స్ కోటాలో సీట్లు సాధించిన వారు ఎందరో...

జనరల్ కోటాలో సీటు రానివారికి హ్యాండ్‌బాల్ క్రీడే ఆపన్నహస్తంగా మారుతోంది. ఈ క్రీడలో గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడినవారు పదుల సంఖ్యలో స్పోర్ట్స్ కోటాలో సులభంగా సీట్లు సాధించడం అభినందనీయం.

### నిరంతర శిక్షణ ఇస్తున్నాం



ఈ గ్రౌండ్ నుంచి ఎంతో మంది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి చేరుకున్నారు. ప్రతి నిత్యం క్రీడా కారులు ఇక్కడ శిక్షణ తీసుకుంటుంటారు.. నేను సైతం ఇక్కడే శిక్షణ పొంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నా. ఉత్సాహం ఉన్న వారందరికీ ఇక్కడ శిక్షణ ఇస్తాం.

– ఇమ్రాన్, కోచ్

## కంటోన్మెంట్‌లో స్థానిక సమస్యలు పరిష్కరించండి

ఎంపీ ఈటల రాజేందర్



ఎంపీ ఈటల రాజేందర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మేజర్ జనరల్ అజయ్ మిశ్రా

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మిలటరీ అధికారులకు సూచించారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ ఆంధ్రా సబ్ ఏరియా (టాసా) జనర్ ఆఫీసర్ కమాండింగ్ (జీఓసీ) మేజర్ జనరల్ అజయ్ మిశ్రాను కలిసి పలు సమస్యలపై చర్చించారు. కంటోన్మెంట్ పరిధిలోని ఆర్మీ స్థలాల్లో వెలిసిన బస్తీవాసులను వేధించొద్దని, దేవాలయాలు, స్కూళ్లకు వెళ్లే దారులను మూసేస్తూ ఆటంకాలు సృష్టించవద్దని సూచించారు. ఈ మేరకు తనకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నట్లు ఆర్మీ ఉన్నతాధికారి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. టాసా కార్యాలయానికి తొలిసారిగా వచ్చిన ఎంపీ ఈటలకు, జ్ఞాపికను అందజేశారు.

## అజయ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

- న్యాయం చేయాలంటూ మార్చురీ వద్ద బంధువుల ఆందోళన
- రూ.10 కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్



గాంధీ మార్చురీ వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబసభ్యులు

గాంధీఆస్పత్రి : భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీపుల్స్‌ప్లాజా వేదికగా ఈనెల 2న నిర్వహించిన కార్యక్రమంలో అగ్నిప్రమాదం కారణంగా మరణించిన అజయ్ మృతదేహానికి సికింద్రాబాద్ గాంధీ మార్చురీలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు, విద్యార్థులు, బీసీ సంఘ నాయకులు పెద్దసంఖ్యలో మార్చురీ వద్దకు చేరుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన చేపట్టడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. స్పష్టమైన హామీ ఇచ్చేవరకు మృతదేహాన్ని తరలించేదిలేదన్నారు. ఈ సందర్భంగా బీసీ రాజ్యాధికార సమితి ప్రతినిధి దాసు సురేష్ మీడియాతో మాట్లాడుతూ రూ.10 కోట్ల నష్టపరిహారం, బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌లు మార్చురీ వద్దకు చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించగా అజయ్ మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో స్వస్థలానికి తరలించారు.

## ఐఎంఎస్ ఉద్యోగుల నిరసన

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఈఎస్ఐ డైరెక్టరేట్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) ఉద్యోగులు ఆందోలన చేశారు. బీమా వైద్య సేవల శాఖ(ఈఎస్ఐ)ని మూసివేసి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే ప్రతిపాదనను నిరసిస్తూ ఆందోళన బాటపట్టారు. భోజన విరామ సమయంలో ఉద్యోగులు ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డీఐఎంఎస్ యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షులు వీరన్న గౌడ్ మాట్లాడారు. ఈఎస్ఐని మూసి వేసి ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా వ్యవహారాన్ని కొనసాగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈ ప్రతిపాదనను ఉద్యోగులు వ్యతిరేకించడంతో పాటు భయాందోళన చెందుతున్నారన్నారు.



ఈఎస్ఐ డైరెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

## నేడు నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న బిషప్ సంజయ్ ఆనంద్

లాలాపేట: ఐక్యతతో సేవ చేయడానికి క్రైస్తవ సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్(ఎన్‌సీసీ) అధ్యక్షులు బిషప్ సంజయ్ ఆనంద్, ప్రధాన కార్యదర్శి బక్క ఏలియా పిలుపునిచ్చారు. తార్నాకలో బుధవారం ఎన్‌సీసీ సన్నాహక సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..ఈ నెల 30న తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సమావేశానికి గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు తెలంగాణ జిల్లాల నుంచి క్రైస్తవ సంఘాల ప్రతినిధులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ డిపార్టుమెంట్ అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, లీగల్ సెల్ ప్రతినిధి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ నూతన కమిటీ ఎన్నిక

ఉస్మానియా యూనివర్సిటీ: పీడీఎస్‌యూ గ్రేటర్ నూతన అధ్యక్షుడిగా రాకేష్, ప్రధాన కార్యదర్శిగా హరీష్‌తో పాటు 17 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాలులో జిల్లా అధ్యక్షుడు అనిల్ అధ్యక్షతన జరిగిన గ్రేటర్ కౌన్సిల్ సమావేశానికి ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ ప్రొ. కొండ నాగేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, నామాల ఆజాద్, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు ఎం.హన్మేష్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ ప్రదీప్, మహిళ సంఘం నేతలు వరలక్ష్మీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో రచ్చకెక్కిన విభేదాలు

- ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఇంగ్లీష్ లెక్చరర్ల మధ్య గొడవ
- పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు

సనత్‌నగర్: బేగంపేటలోని మహర్షి మహిళా కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు, ఇంగ్లీష్ లెక్చరర్‌కు మధ్య ఉన్న విబేధాలు రచ్చకెక్కాయి. ఒకరిపై ఒకరు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన మేరకు.. ఈ నెల 25న మధ్యాహ్నం ఇంగ్లీష్ లెక్చరర్ మరికొందరితో కలిసి కార్యాలయ ఆవరణలో కూర్చొన్న సమయంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, మరో క్లర్క్ వీడియో తీస్తుండడాన్ని గుర్తించింది. వెంటనే లోపలికి వెళ్లి ఫోన్ లాక్కొని పగులగొట్టారు. ఇదే విషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కార్యాలయం ముందు కూర్చొని కొందరు వెకిలి చేష్టలు చేస్తుండగా సాక్ష్యం కోసం వీడియో తీశానని, దీంతో ఇంగ్లీష్ లెక్చరర్ తన ఫోన్ లాక్కొని పగులగొట్టారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. తనను వీడియో తీయడంపై ఇంగ్లీష్ లెక్చరర్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇద్దరి ఫిర్యాదులను పోలీసులు స్వీకరించారు. విచారణ జరిపిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.

## గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



రాంగోపాల్‌పేట్: మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ గుండెపోటుతో బుధవారం కన్నుమూశారు. ప్రకాశం జిల్లా కంబం చెరుకుపల్లికి చెందిన బొర్రా కార్తిక్ (31) 2020లో కానిస్టేబుల్‌గా చేరారు. ప్రస్తుతం మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ భార్య నీలిమతో కలిసి రాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. స్వస్థలంలో పని ఉండటంతో ఆయన ప్రకాశం జిల్లా కంబంకు వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఉండగానే గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడు. కానిస్టేబుల్ మృతితో స్థానిక మార్కెట్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది విషాదంలో మునిగిపోయారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంప్ నెంబర్ 6 మహమ్మద్ పాషా ఆలీ(28) నివాసముంటున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నాడు. బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లడానికి సన్నద్ధమయ్యాడు. ఓ శుభ కార్యం నిమిత్తం భార్య తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. మంగళవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా టవల్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: పేదింటి ఆడపడుచు పెళ్లికి మొట్టమొదటిగా ఆర్థిక సహాయం అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో అమీర్‌పేట, బేగంపేట డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆడబిడ్డ పెళ్లి చేయాలంటే ఆర్థికంగా ఎంతో భారంగా మారిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని చేయూతను ఇవ్వాలనే ఆలోచనతో దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.1,00116లు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శేఖర్, కూతురు నర్సింహ, గోపీలాల్‌చౌహాన్, బలరాం, ఆరీఫ్, అఖిల్, హరిసింగ్, సుమిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీల సమస్యలను పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే శ్రీగణేష్



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం ఇస్తున్న బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్ హమాలీలు

అడ్డగుట్ట: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్ హమాలీల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీ ఇచ్చారు. బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో పనిచేసే హమాలీలు సంఘం అధ్యక్షుడు ఉగ్రం రాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను తుకారాం గేట్‌లోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా వారు 30 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. హమాలీలు విశ్రాంతి తీసుకోవడానికి హాలు, మూత్రశాలలు తదితర సమస్యలను పరిష్కరించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌ను ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆదేశించారు.

## ఎమ్మార్పీఎస్ సదస్సును విజయవంతం చేయండి



హమాలీబస్తీలో డప్పు ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

చిలకలగూడ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగ ఉపకులాల సదస్సు, లక్ష డప్పులు వేయి గొంతుల కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. మెట్టుగూడ డివిజన్ హమాలీబస్తీలో బుధవారం డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఫిబ్రవరి 1న మాదిగ ఉపకులాల సదస్సు, 7వతేదిన లక్ష డప్పులు, వేయి గొంతుల కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డప్పుమల్లిఖార్జున మాదిగ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు బొంజూరు విజయ్‌కుమార్‌మాదిగ, జునపల మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.

## ఓయూలో బైక్ ర్యాలీ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకులు తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. బుధవారం క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు బైక్ ర్యాలీ చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉపేందర్, విజేందర్ రెడ్డి, రేష్మారెడ్డి, సనత్, కిరణ్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



## అత్యాధునిక సేవలతో ఉత్తమ గుర్తింపు

డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న కమలాసన్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సనత్‌నగర్: ఉత్తమ సేవలతో ఏడాదిలోపే అనంత రిహాబిలిటేషన్ సెంటర్ మంచి గుర్తింపు తెచ్చుకుందని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అన్నారు. బేగంపేటలోని అనంత రిహాబిలిటేషన్ సెంటర్ ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. రిహాబిలిటేషన్ సెంటర్‌ను నెలకొల్పి విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంత రిహాబ్ సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఏడాది కాలంలో 1100 మంది జీవితాల్లో మార్పు తెచ్చామన్నారు. ఈ దిశగా అత్యానిక సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. కేవలం ఆరోగ్యాన్ని పునరుద్ధరించడం మాత్రమే కాదని, వారికి గౌరవప్రదమైన, స్వతంత్ర జీవనాన్ని అందించడమే తమ లక్ష్యమన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆసియాలోనే అత్యంత పెద్దదైన రిహాబిలిటేషన్ సెంటర్ హైదరాబాద్‌లో ఉండడం తెలంగాణవాసుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సచ్చిదానందరావు, కిషోర్ కారుమూరి, డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

## 15న సెలవు దినంగా ప్రకటించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరాటే రాజు

ఉస్మానియా యూనివర్సిటీ: సేవాలాల్ మహారాజ్ జయంతి పురస్కరించుకొని ఫిబ్రవరి 15న జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా.కరాటే రాజు డిమాండ్ చేవారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట గిరిజన నాయకులతో కలసి కరాటే రాజు చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 15 కోట్ల బంజారాలు ఉన్నారని, సేవాలాల్ జయంతి వేడుకలకు రూ.1000 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం నేతలు ఇందల్ రథోడ్, వెంకట్ బంజార, లోకేష్‌నాయక్ పాల్గొన్నారు.